క్లుప్తంగా

పొలం గట్ల తగాదాలో కత్తితో వ్యక్తిపై దాడి

గుంటూరు రూరల్: పొలంగట్ల వద్ద ఏర్పడిన తగాదాలో ఓ వ్యక్తిపై ప్రత్యర్థులు కత్తితో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం చౌడవరం గ్రామానికి చెందిన తోకల శివనాగేశ్వరరావు స్థానికంగా పొలం పనులు చేసుకుని జీవిస్తుంటాడు. అతని పొలం పక్కనే యనగంధాల శ్రీరామయ్య పొలం ఉంది. ఎప్పటినుంచో ఇరువురి మధ్యన పొలం హద్దుల తగాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం శివనాగేశ్వరరావు తన పొలం వద్ద పనిచేసుకుని ఇంటికి ద్విచక్రవాహనంపై వస్తుండగా శ్రీరామయ్య అతని వద్దకు వచ్చి కొబ్బరిబోండాలు నరికే కత్తితో దాడిచేశాడు. దీంతో శివనాగేశ్వరరావుకు తల కడుపులో, చాతీపై, బుజంపై తీవ్రగాయాలయ్యాయి. హత్య చేసేందుకు కుట్రపన్నాడని తేరుకుని శివ నాగేశ్వరరావు తన ద్విచక్రవాహనంపై అక్కడి నుంచి పరారయ్యాడు. ఇంటికి చేరుకుని బంధువులతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు వెళ్లారు. జీజీహెచ్‌లో పరీక్షించిన వైద్యులు శివనాగేశ్వరరావు పరిస్థితి బాగానే ఉందని తెలిపారు. శివనాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మకర జ్యోతి దర్శనం



పాత గుంటూరు: స్థానిక ఏలూరు బజారు కోదండ రామాలయం వద్ద వాసవి మణికంఠ సేవా భక్త బృందం ఆధ్వర్యంలో మకర సంక్రాంతి సందర్భంగా మకర జ్యోతి దర్శన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని మకర జ్యోతిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. కార్యక్రమాన్ని నాళం శివప్రసాద్, పాదర్తి ఉమామహేశ్వరరావు, పులిపాటి సుధాకర్ మూర్తి, దేవతి శివకుమార్, డి.రవి కుమార్, ఎ.నాగ సతీష్ నిర్వహించారు.

సంక్షేమ సేవా సమితి క్యాలెండర్ ఆవిష్కరణ

గుంటూరు ఎడ్యుకేషన్: బ్రాహ్మణ ఉద్యోగ, ఉపాధ్యాయ సంక్షేమ సేవా సమితి నూతన



సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం బ్రాడీపేటలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు జె.పార్థసారథి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏపీ ఎన్జీవో నాయకుడు ఎం. నరసింహమూర్తి మాట్లాడుతూ ఉద్యోగులంతా డీఏ, పీఆర్సీ, ఇతర బకాయిలు అందించాలని కోరారు. సేవా సమితి కార్యదర్శి పీఎస్ శివన్నారాయణ, బి.మల్లికార్జున శర్మ, నరసింహారావు, గౌరీనాథ్, అరుణ్ కుమార్, వేణుగోపాలరావు, సీతా రమేష్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లు అరెస్టు

పట్నంబజారు: పేకాటాడుతున్న పలువురిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాలు.. కార్మికుల కాలనీలోని బహిరంగ ప్రదేశంలో పేకాటాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని, వీరి నుంచి రూ.4,260 స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

బీసీ సంకల్పసభను విజయవంతం చేయాలి

మంగళగిరి: ఈ నెల 18వ తేదీ జరిగే బీసీ సంకల్పసభను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో సంకల్పసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. బీసీల హక్కుల సాధనకై జరుగుతున్న సభకు బీసీలంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కర్రి వేణుమాధవ్, జింక దివ్యనారాయణ, ఉడతా శ్రీనివాస్, ఆలా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

మంగళగిరి: నగర పరిధిలోని బేతపూడిలో పేకాట శిబిరంపై దాడిచేసిన పోలీసులు ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు పేకాట శిబిరంపై దాడులు చేసి ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్దనుంచి రూ.6,150 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పెదవడ్లపూడిలో కోడి పందేలు నిర్వహిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు కోళ్లు, రూ.4500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కనుల పండువగా సంక్రాంతి సంబరాలు

- రూ.14 లక్షలకు వేలంలో లడ్డూ పాడుకున్న భక్తుడు
- సంబరాల్లో పాల్గొన్న సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: నల్లపాడు చల్లావారిపాలెం గ్రామ ప్రజల ఇలవేల్పుదేవత శ్రీ పుట్టలమ్మతల్లి శ్రీఘంటాలమ్మతల్లి సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఐదు రోజులపాటు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సంబరాల్లో సోమవారం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం కార్యక్రమంలో భాగంగా అమ్మవారి సంక్రాంతి సంబరాల్లో నిర్వహించిన ముగ్గుల పోటీలు, షటిల్ బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతులు అందజేశారు. అమ్మవారి వద్ద ఐదు రోజులపాటు ప్రత్యేక పూజలందుకున్న 9 కిలోల అమ్మవారి ప్రసాదం లడ్డు వేలం నిర్వహించారు. ఆలయ కమిటీ, యడవల్లి నరేంద్రశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డు వేలం పోటా పోటీగా సాగింది. అమ్మవారి ప్రసాదంను దక్కించుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. పోటీలో నల్లపాడు చల్లవారిపాలెం గ్రామానికి చెందిన మిర్చి వ్యాపారి బత్తిన బోయిన రామచంద్రయాదవ్ రూ 14 లక్షల రూపాయలకు కైవశం చేసుకున్నారు. లడ్డును వేలంలో పాడుకున్న భక్తుడికి లడ్డుతోపాటు ఇంటూరి వీరారెడ్డి, రాజశేఖర్‌రెడ్డిలు 9 గ్రాముల బంగారు అమ్మవారి లాకెట్‌ను బహుమతిగా అందజేశారు. అనంతరం రఘు రేలా రే రేలా, శ్రీదేవి డ్రామా కంపెనీ ఫేంతో సాగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. వినుకొండ ముసలారెడ్డిచే ఏర్పాటు చేసిన 100 అడుగుల విద్యుత్ ప్రభ ఆకర్షణగా నిలచింది. లడ్డును వేలంలో పాడుకున్న భక్తుని ఇంటివరకూ భారీ భజంత్రీలు, తీన్‌మార్ డప్పులు, మేళతాళాలు, అమ్మవారి వేషదారణలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఇంటూరి అంజిరెడ్డి, కమిటీ సభ్యులు తదితరులు వేలాదిగా పాల్గొన్నారు.



ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తదితరులు



సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న భక్తులు



వాలీబాల్ విజేతలకు బహుమతులు అందజేసి వారితో బలసాని కిరణ్‌కుమార్



పొన్నూరులో నిర్వహించిన సాక్షి భావనారాయణ స్వామి గ్రామోత్సవం

వాడవాడలా సంక్రాంతి సంబరాలు

గుంటూరు రూరల్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని వాడవాడలా సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. కార్యక్రమాల్లో భాగంగా సోమవారం మండలంలోని గోరంట్ల గ్రామంలో తాళ్ళ పెద్ద సాంబయ్య వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు పత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ బైక్ ర్యాలీని నిర్వహించి సమన్వయకర్తను సాదరంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో సమన్వయకర్త మాట్లాడుతూ స్త్రీలు, యువత క్రీడల్లో రాణించి నైపుణ్యతలు మెరుగు పరుచుకోవాలన్నారు. ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ తాళ్ళ వీరయ్య యాదవ్, 47వ డివిజన్ అధ్యక్షుడు జల్లేపల్లి వేణుబాబు, తాళ్ళ అబ్బులు, దుంపాల రాధ, రాజేష్, క్లస్టర్ 2 ఇంచార్జ్ బండారు శ్రీనివాసరావు, బుక్క చిన్న శివయ్య, వి శివయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

48వ డివిజన్ హిమనీ నగర్‌లో...

48వ డివిజన్ హిమనీ నగర్‌లో హిమనీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. సంక్రాంతి సంబరాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు, క్రీడలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో 48వ డివిజన్ అధ్యక్షుడు లక్కిరెడ్డి మనోహర్‌రెడ్డి, హిమనీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మాబు సుబాని, జనరల్ సెక్రటరీ చక్రపాణి, ట్రజరర్ బోజారావు, స్థానిక ప్రజలు వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏటుకూరు శ్రీ కనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు

సంక్రాంతి సంబరాల్లో భాగంగా పత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ 16వ డివిజన్ ఏటుకూరు గ్రామంలోగల శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులు స్వీకరించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పెద్దింటి రామకోటి, ఆలయ ధర్మకర్త నాగేశ్వరరావు, బోరుగడ్డ రజనీకాంత్, తుమ్మల రవితేజ, పలక సుబ్బయ్య, ప్రతివాడ సురేష్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులున్నారు.

పొన్నూరులో..

పొన్నూరు: మండలంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. సోమవారం మకర సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగలను విశేషంగా జరుపుకున్నారు. సంక్రాంతి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పూజలు అనంతరం స్వామివారికి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఇంటి ముంగిళ్లల్లో యువతులు, మహిళలు ఇంద్ర ధనుస్సు లాంటి రంగవల్లులను తీర్చిదిద్దారు. ముగ్గుల్లో బంతి పూలు, గొబ్బెమ్మలను పెట్టి భక్తిశ్రద్ధలతో సంక్రాంతికి స్వాగతం పలికారు. గోపూజలు చేశారు. హరిదాసులు కీర్తనలు ఆలపిస్తూ వీధుల్లో సందడి చేశారు. గంగిరెద్దుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నా పెద్ద తేడా లేకుండా గాలిపటాలను ఎగురవేస్తూ కేరింతలు కొట్టారు. వ్యవసాయంలో తమకు ఎంతో చేదోడుగా ఉండే పశువులకు పూజలు చేశారు. పలు గ్రామాల్లో గ్రామ పెద్దలు ముగ్గుల పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పట్టణానికి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకులు ముగ్గుల పోటీలు నిర్వహించి, సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విందు కార్యక్రమాలు ఏర్పాటు చేసి పార్టీ నాయకులు కార్యకర్తలను ఆహ్వానించారు.

- **కోడి పందేలు జరగకుండా చర్యలు**

పట్టణ, రూరల్ పోలీసులు మండలంలో కోళ్ల పందాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టారు. మండలంలోని బ్రాహ్మణ కోడూరు శివారు ప్రాంతంలో కోడి పందాలు నిర్వహిస్తున్న పదిమందిని అదుపులో తీసుకొని, వారి వద్ద నుంచి రూ 4500, వాటితోపాటు 10 కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై భార్గవ్ తెలిపారు.

చేబ్రోలులో కర్పూర జ్యోతి దర్శనం

చేబ్రోలు: సంక్రాంతి సందర్భంగా చేబ్రోలులోని చారిత్రక ప్రసిద్ధిచెందిన నాగేశ్వరస్వామి దేవస్థానం వద్ద సోమవారం రాత్రి కర్పూర జ్యోతి దర్శనాన్ని భక్తులు వీక్షించారు. సుమారు 20 కిలోల కర్పూరాన్ని అయ్యప్ప గురుస్వామి, ఆలయ అర్చకులు వెలిగించారు. దేవాలయంలోని అయ్యప్పస్వామి విగ్రహానికి విశేష పూజలు నిర్వహించారు. అయ్యప్ప భక్త బందం ఆలపించిన పాటలు ఆకట్టుకున్నాయి. కర్పూర జ్యోతి దర్శన కార్యక్రమానికి చేబ్రోలు పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అయ్యప్పస్వాములు, భక్తులు తదితర భక్త బందం చేపట్టిన జ్యోతి దర్శన కార్యక్రమం భక్తులకు కనువిందు చేశాయి. నాగేశ్వర స్వామి దేవస్థానంలో అర్చక బందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన గట్టుపల్లి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



చేబ్రోలులో కర్పూర జ్యోతి దర్శనం ఇలా....

ముగిసిన ధార్మిక శిక్షణ తరగతులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెం మస్జిద్ ఎ మొహమ్మద్‌తో నిర్వహిస్తున్న ధార్మిక శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అబ్దుర్రహ్మాన్ విచ్చేసి మాట్లాడారు. ఇల్మ్ ప్రాముఖ్యతపై అబ్దుల్ హఫీజ్ ఉమ్రీ, బిద్ అత్ పర్యవసానం అనే అంశంపై అబ్దుల్ మబూద్ జామిఈ, సున్నత ప్రాముఖ్యతపై అబ్దుల్లా జామిఈ, షిర్క్ (బహు దైవారాధన) అనే అంశంపై ఇల్యాస్ దాయీ, ఉలమాయే దీన్‌కి ఫజీలత్ అనే అంశంపై ఫయాజ్ ఆలమ్ అల్వాని ప్రసంగించారు.

చర్మకార సంక్షేమ సంఘం మండల ఉపాధ్యక్షుడిగా సుబ్బారావు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల చర్మకార సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులుగా కంఠంరాజు కొండూరుకు చెందిన కొండూరు సుబ్బారావును రాష్ట్ర సంఘం నియమించింది. మంగళవారం ఆ నియామకపత్రాన్ని ఏపీ చర్మ కార సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు కంఠంరాజు కొండూరు గ్రామంలో కొండూరు సుబ్బారావుకు అందజేశారు. సుబ్బారావు మాట్లాడుతూ మండలంలో చర్మకారులు, డప్పు కళాకారులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసువెళ్లి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని, రాష్ట్ర చర్మకార సంక్షేమ సంఘం తనపై ఉంచిన బాధ్యతను నిర్వహిస్తానని అన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

రాష్ట్ర సమాచార కమిషనర్ విజయ్‌కుమార్‌రెడ్డి



రావెల(తాడికొండ): సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర సమాచార కమిషనర్ టి.విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. తాడికొండ మండలం రావెల గ్రామంలో వేమన కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. పరిషత్ ఉపాధ్యక్షులు భీమవరపు ధర్మారెడ్డి, ఈమని, భాస్కర్‌రెడ్డి, వంగపాటి బ్రహ్మం, ఏరువ లూర్దురెడ్డి, సింహాద్రి మధుసూదన్‌రెడ్డి, వరగాని వెంకటేష్ పాల్గొన్నారు.

మంచాలలో ఘనంగా గ్రామోత్సవాలు

చేబ్రోలు: చేబ్రోలు మండలంలోని వివిధ గ్రామాల్లో సంక్రాంతి పండుగ సందర్భంగా స్వామి వార్ల గ్రామోత్సవ కార్యక్రమాలు వైభంగా జరిగాయి. మండల కేంద్రమైన చేబ్రోలు, మంచాల, శలపాడు, శ్రీరంగపురం, నారాకోడూరు, శేకూరు తదితర గ్రామాల్లోని ప్రదాన ఆలయాల్లో ధనుర్మాసం సందర్భంగా గోదాదేవి కల్యాణోత్సవాలను కనుల పండువగా నిర్వహించారు. కల్యాణోత్సవం అనంతరం స్వామి వార్లు ప్రధాన రహదారుల్లో ఊరేగింపు జరిగింది. చేబ్రోలులోని ప్రదాన దేవాలయాలైన సంక్రాంతి పండుగ రోజున నాగేశ్వరస్వామి, భీమేశ్వరస్వామి, ఆదికేశవస్వామి, రంగనాథస్వామి, జ్వాలా లక్ష్మీ నరసింహస్వామి గ్రామోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మంచాల గ్రామంలోని గంగా పార్వతి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి, కోదండ రామస్వామి, వేణుగోపాలస్వామి దేవస్థానాల్లో దనుర్మాస సందర్భంగా కల్యాణోత్సవాలు జరిగాయి. అనంతరం ట్రాక్టర్లపై స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రధాన రహదారుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మంచాలలో జరిగిన గ్రామోత్సవంలో ప్రత్యేక వాహనాలపై స్వామి వార్ల ఊరేగింపు

గత నెల రోజులుగా ధనుర్మాసం సందర్భంగా ఆలయాల్లో అర్చకస్వాములు ప్రత్యేక పూజలు, వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. వేజండ్ల గ్రామంలోని కోదండరామస్వామి, శ్రీరంగపురంలోని మోహన రంగ నాయకస్వామి దేవస్థానాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఉత్సవ విగ్రహాలను అర్చకులు గ్రామోత్సవం నిర్వహించారు.

సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి



అన్నపర్రులో తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



తెప్పోత్సవం అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృ శ్యం

పెదనందిపాడు: తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ నిలుస్తుందని జెడ్పీటీసీ సభ్యురాలు కల్లూరి అన్నపూర్ణ అన్నారు. సోమవారం మండల పరిధిలోని అన్నపర్రు గ్రామంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవాలయం ఉత్సవ విగ్రహాలను గ్రామంలో తెప్పోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా కల్లూరి అన్నపూర్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ పండుగను చాలా సంతోషంగా జరుపుకున్నారని, స్వామి వారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ ఉండాలని ఆమె అకాంక్షించారు. ఈ తెప్పోత్సవానికి గ్రామస్తులు అందరూ హాజరై తిలకించారు. సంక్రాంతి పండుగ కావడంతో ఎక్కడెక్కడో ఉన్న వారందరూ తమ గ్రామాలకు తరలివచ్చి సంక్రాంతి పండుగను బాగా జరుపుకున్నారు. తెప్పోత్సవం అనంతరం ఉత్సవ విగ్రహాలకు అర్చకులు స్వర్ణ హరీష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం గ్రామంలో ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కల్లూరి నాగేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

డాక్టర్ రమణ యశస్వికి సన్మానం

లక్ష్మీపురం: కళారత్న డాక్టర్ రమణ యశస్వీ ఆర్థోపెడిక్‌గా కవిగా, రచయితగా సంఘ సేవకుడిగా అన్ని రంగాలలో రాణిస్తూ బహుముఖ ప్రజ్ఞాశాలిగా అందరి అభిమానం పొందుతున్నారని సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, ఎస్.హెచ్.ఓ అధ్యక్షులు డాక్టర్ సేవాకుమార్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ రమణ యశస్వీని సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ వి.వి.రామ్‌కుమార్, రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.

మాట– మాట..

మూడు రోజులుగా సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. మంగళవారం మాట– పాట కార్యక్రమం నిర్వహించారు. వేడుకలకు కళాసాధ అధ్యక్షుడు బిళ్లా అశోక్ కో ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ప్రముఖ గాయకులు రత్నాజీ, కవులు జమదగ్ని, రాజశేఖర్, ఎ.నారాయణ, భాగ్యలక్ష్మీ, సాయిబాబు, పోతురాజు, మల్లేశ్వరరావు, జయలక్ష్మీ, సుబ్రహ్మణ్యం, పాల్గొన్నారు.

యోగా క్యాలెండర్ ఆవిష్కరణ



తాడేపల్లిరూరల్: మంగళగిరి శ్రీ లక్ష్మీనారాయణస్వామి దేవస్థానం ఆవరణలో మంగళవారం మంగళగిరి పట్టణానికి చెందిన శ్రీ రాధాకృష్ణ యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో నూతన సంవత్సర యోగా క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా తహసీల్దార్ జి.వి.రామ్‌ప్రసాద్ విచ్చేసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కంప్యూటర్ యుగంలో యోగ సాధన ద్వారా మనిషి ఒత్తిడిని జయించవచ్చని అన్నారు. శ్రీ రాధాకృష్ణ యోగ సేవా కేంద్రం వ్యవస్థాపకులు పడమట రాధాకృష్ణ, యోగ సాధకులు డోగిపర్తి శ్రీహరిరావు, కందం రాంబాబు, జె.నారాయణ, కాంద్రు కోటేశ్వరరావు, పి.చంద్రశేఖర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

రామాలయం వద్ద మకరజ్యోతి దర్శనం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని రామాలయం వద్ద మకర సంక్రాంతిని పురస్కరించుకుని సోమవారం రాత్రి 22 కిలోల కర్పూరంతో మకరజ్యోతిని వెలిగించారు. కార్యక్రమానికి ముందుగా హరిహరసుత అయ్యప్పస్వామికి అర్చకులు రాజేంద్రశర్మ పూజలు చేశారు. అనంతరం ఆలయం వెలుపల ఏర్పాటుచేసిన ప్రదేశంలో 22కిలోల కర్పూరంతో జ్యోతిని వెలిగించారు. అనేక మంది భక్తులు అయ్యప్ప నామస్మరణ చేస్తూ జ్యోతిని దర్శించుకున్నారు. ఆర్యవైశ్యసంఘపెద్దలు డి.నరేంద్రకుమార్, జి.మధుసూదనరావు, కె.వెంకటేశ్వరరావులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

బ్లడ్‌బ్యాంకుకు సామగ్రి అందజేత

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావడం అభినందనీయమని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. పొదిల ప్రసాద్ బ్లాక్‌లోని రెండో బ్లడ్ బ్యాంక్ కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఉదయ్ ఆస్పత్రి అధినేత డాక్టర్ రామకృష్ణా రెడ్డి రూ.2 లక్షల విలువ చేసే పరికరాలను బ్లడ్ బాంక్‌కు అందజేశారు. ఈ పరికరాలను డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ రామకృష్ణా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ రక్తంలోని ప్లాస్మాను, రక్త కణలను వేరు చేసే సెంట్రి ఫ్యూస్, బ్లడ్ బ్యాగ్ సీల్ పరికరాలు డాక్టర్ రామకృష్ణా రెడ్డి అందించారన్నారు. ఆస్పత్రిలో రెండో బ్లడ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేసి ఆపరేషన్ థియేటర్‌లకు అందుబాటులో ఉంచామని చెప్పారు. గతంలో బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లాలంటే కష్ట తరంగా ఉండేదని ప్రస్తుతం కొత్తగా ఆధునికీకరించిన రూ.40 లక్షల వ్యయంతో నిర్మించి రెండు ఆపరేషన్ థియేటర్‌ల వద్ద బ్లడ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డాక్టర్ రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ గుంటూరు మెడికల్ కళాశాలలో విద్యనభ్యసించానన్నారు. తన వంతు సహాయంగా ఈ పరికరాలను అందించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ గోవిందా నాయక్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎ.సురేష్, సివిల్ సర్జన్, ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశ సజని పాల్గొన్నారు.



పరికరాలకు సంబంధించిన పత్రాలను డాక్టర్ కిరణ్ కుమార్‌కు అందజేస్తున్న డాక్టర్ రామకృష్ణారెడ్డి

సాంస్కృతిక విప్లవకారుడు త్రిపురనేని

పాత గుంటూరు: తెలుగు సమాజంలో కవి రాజు త్రిపురనేని రామస్వామి హేతువాద భావజాలంతో సాంస్కృతిక విప్లవకారుడిగా చరిత్రలో ప్రసిద్ధి చెందారని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ అన్నారు. రింగ్ రోడ్డు లోని ఆర్‌వీఆర్ జేసీ కళాశాలలో కవిరాజు త్రిపురనేని రామస్వామి వర్ధంతి సభ మంగళవారం నిర్వహించారు. త్రిపురనేని రామస్వామి సాహితీ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గద్దె మంగయ్య, అలోకం పెద్దబ్బాయి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అలోకం పెద్దబ్బాయి మాట్లాడుతూ తెలుగు సమాజంలో సాహిత్య, సాంస్కృతిక, భావజాల రంగాల్లో తన హేతువాదంతో త్రిపురనేని రామస్వామి పోరాటం చేశారన్నారు. అనంతరం విల్సన్‌కు కవిరాజు త్రిపురనేని రామస్వామి పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్‌యూ మాజీ రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు, ప్రముఖ సాహిత్య పరిశోధకుడు పారా అశోక్ కుమార్, వల్లూరి తాండవ కృష్ణ, రచయిత జొన్నలగడ్డ రామారావు పాల్గొన్నారు. కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి రాసిన గీతాలను పి.వి. రమణ బృందం ఆలపించారు.



విల్సన్‌ను త్రిపురనేని పురస్కారంతో సన్మానిస్తున్న పాపినేని

ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడలు దోహదం

తాడేపల్లిరూరల్: యువతీ యువకుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని డీవైఎఫ్ఐ పూర్వ జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు అన్నారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్ సెంటర్‌లో ఐద్వా, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ఆటల పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అప్పారావు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలను ప్రోత్సహించాలని అన్నా రు. విజేతలకు బహుమతులు అందజేశారు. దర్శి చిన్న దుర్గారావు, బొందలపాటి ప్రభాకరరావు, బూరగ జయరావు, నవనీతం, బూరగ కిట్టు, చిన్న, శ్రీకాంత్,సాయి, యం.చిన్న చెన్నయ్య పాల్గొన్నారు.

దుగ్గిరాలలో...

దుగ్గిరాల మండలం తుమ్మపూడి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారులకు మ్యూజికల్ చైర్, వాలీబాల్, కబడ్డీ పోటీలను డీవైఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం, మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. విజేతలకు మంగళవారం బహుమతులను జెట్టి బాలరాజు అందజేశారు. కార్యక్రమంలో వమన్న నరసింహారావు, మన్నవ నాగ మల్లేశ్వరరావు, బి. చిరంజీవి, జి.యోహాను, అజయ్ ప్రకాష్ పాల్గొన్నారు.